# ఉత్సాహంగా 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం



ముంచంగిపుట్టు మండల తెలుగు యువత అధ్యక్షులు మజ్జి చిన్ని.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఆగస్టు 21.** మండలంలోనీ ఏనుగురాయి పంచాయతీ, గాదెలబురుగు గ్రామంలోని ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించినట్లు మండల తెలుగు యువత అధ్యక్షుడు ఎం చిన్ని తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల కరపత్రాలను ప్రతి ఇంటికి వెళ్లి ఆప్యాయంగా పలకరిస్తూ ప్రజలకు అందజేసి వివరించామన్నారు. ప్రతి కుటుంబాన్ని ఆప్యాయంగా పలకరించి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నామని, స్థానికంగా ఉన్న సమస్యల గురించి ఆరా తీసి వాటి సమస్యపై దృష్టి పెట్టమన్నారు. ప్రభుత్వ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నట్లు చిన్ని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు టీ తిరునాద్, వి మధు, జి తిరుపతి, వి మనుమతి తదితరులు పాల్గొన్నారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# ఓటర్ల జాబితాను పరిశీలించండి



- 22, 23, 29, 30 తేదీల్లో ప్రత్యేక ప్రచార దినాలు
- క్లెయిమ్‌లు, అభ్యంతరాలు ఉంటే సమర్పించాలి: కలెక్టర్ నిషాంతి

**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు,పెన్ పవర్,ఆగస్టు 21:** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా ఈ నెల 22, 23, 29, 30 తేదీల్లో జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ప్రచార దినాలను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ టి. నిషాంతి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయా పోలింగ్ కేంద్రాల్లో బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.ఓటర్లు తమ పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంచిన ముసాయిదా ఓటర్ల జాబితాలను పరిశీలించుకోవాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా ఎ ఎస్ డి డి (గైర్హాజరు, వేరే ప్రాంతానికి మారిన, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన, మరణించిన) ఓటర్ల జాబితాతో పాటు నోటీసులు జారీ చేసిన ఓటర్ల వివరాలను కూడా పరిశీలించుకోవాలని కోరారు.ఓటర్ల జాబితాలో తమ పేరు ఉందో లేదో ప్రతి ఒక్కరూ స్వయంగా పరిశీలించుకోవాలని, పేరు లేకపోవడం, చిరునామా లేదా ఇతర వివరాల్లో తప్పులు ఉన్నట్లు గుర్తిస్తే నిబంధనల ప్రకారం క్లెయిమ్‌లు, సవరణలు లేదా అభ్యంతరాలను సమర్పించాలని తెలిపారు.అర్హత ఉన్న ఓటరు పేరు పొరపాటున తొలగించబడినా లేదా ఎఎస్ డిడి జాబితాలో తప్పుగా చేర్చినా సంబంధిత విధానం ప్రకారం క్లెయిమ్ చేసుకోవచ్చని చెప్పారు. అదేవిధంగా అనర్హమైన లేదా తప్పుగా నమోదైన వివరాలు గుర్తిస్తే అభ్యంతరాలు నమోదు చేయవచ్చన్నారు.రాజకీయ పార్టీలకు చెందిన బూత్ స్థాయి ఏజెంట్లు (బీఎల్ఏలు) సైతం ప్రత్యేక ప్రచార దినాల్లో అందుబాటులో ఉండి ఓటర్ల జాబితా పరిశీలనలో భాగస్వాములు కానున్నట్లు కలెక్టర్ తెలిపారు. తుది ఓటర్ల జాబితా ప్రచురణకు ముందు జాబితాను ఖచ్చితంగా, సమగ్రంగా రూపొందించేందుకు ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# గన్నెల పర్యటనలో ముఖ్యమంత్రి ఆదివాసులకు స్పష్టమైన హామీ ఇవ్వాలి

**గిరిజనుల భూములు, ఉద్యోగాలు, జీవనోపాధికి రక్షణ కల్పించాలి.**


**కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ విభాగం రాష్ట్ర వైస్ చైర్మన్ వెంగడ నీలకంఠం.**



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఆగస్టు 21.** అల్లూరి సీతారామరాజు జిల్లా, అరకు ప్రాంతంలోని గన్నెల పర్యటన సందర్భంగా ఆదివాసి గిరిజనుల హక్కులు చట్టాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టమైన హామీ ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ విభాగం రాష్ట్ర వైస్ చైర్మన్ వెంగడ నీలకంఠం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన పాత్రికేయులకు విడుదల చేసిన ఓ ప్రకటన ప్రకారం.. గిరిజనుల హక్కులు రాజ్యాంగ బద్ధమైనవని, ఎన్నికల హామీలను మాటలకే పరిమితం చేయకుండా ఆచరణలో చూపాలని స్పష్టం చేశారు. రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్, 1/70 భూ చట్టాన్ని కట్టుదిట్టంగా అమలు చేసి అక్రమ భూకబ్జాలు, బినామీ లావాదేవీలను అరికట్టాలనీ, గిరిజనుల భూములు, ప్రకృతి వనరులు దెబ్బతినకుండా హైడ్రో ప్రాజెక్టులపై ప్రభుత్వం తన వైఖరిని ప్రకటించాలన్నారు. యువతకు 100శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలనీ, ఐటిడిఏ పరిధిలో ఇటీవల డీఎస్సీ ద్వారా జరిగిన గిరిజనేతరుల నియామకాలపై విచారణ జరిపి, విరుద్ధంగా ఉన్న నియామకాలను రద్దు చేసి గిరిజన అభ్యర్థులకు న్యాయం చేయాలన్నారు. ?ముఖ్యమంత్రి తన పర్యటనలో గిరిజనుల భూమి, ఉద్యోగాలు, జీవనోపాధి పరిరక్షణపై కాలపరిమితితో కూడిన స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను ప్రకటించాలని ఆయన ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

# గిరి విద్యార్థులకు పాఠశాల భవనం లేదు - టార్పలిన్ షెడ్డే దిక్కు





- పాఠశాల భవనం లేక పిల్లల చదువుకై టార్పాలిన్ షెడ్డును శ్రమదానంతో నిర్మించిన గ్రామస్తులు
- మొంజగూడ ఎన్ ఆర్ ఎస్ టి సి పాఠశాలలో 26 మంది విద్యార్థులు.
- గ్రామంలో శాశ్వత పాఠశాల మంజూరు చేసి, పర్మినెంట్ ఉపాధ్యాయుని నియమించాలి.
- మొంజగూడ విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఆగస్టు 21.** స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు దాటిన గిరిజన గ్రామాల్లో విద్యార్థులకు విద్యను అభ్యసించడానికి సరైన సత్రం దొరుకుట లేదు. ప్రభుత్వాలు మారిన గిరి గ్రామాల పరిస్థితులు మారటం లేదు. విద్యను అందించుటకు అరకొర ఉపాధ్యాయులతో విద్యావ్యవస్థను నెట్టుకొస్తున్న దారుణ పరిస్థితి ఏజెన్సీ వ్యాప్తంగా ఉంది. గిరిజన ప్రాంతంలో సరైన పాఠశాల భవనాలు లేక రేకుల షెడ్డులో, చెట్ల కింద, పంచాయతీ భవనాల్లో, కమ్యూనిటీ హాల్స్ లో, శిథిలావస్థలో చేరిన పాత భవనాల్లో, కొన్నిచోట్ల గుడారాలు లేక పూరిపాకల సాయంతో తరగతి గదులు నిర్వహిస్తున్నా పరిస్థితి ఏజెన్సీ వ్యాప్తంగా చూడొచ్చు.

ఈ తరహా లోనే ఆంధ్రప్రదేశ్ లోని అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలంలోని మారుమూల లక్ష్మీపురం పంచాయతీలో గల మొంజాగూడ గ్రామంలో విద్యార్థుల చదువుకై తల్లిదండ్రులు గ్రామస్తులు ఒక ప్రత్యేక టార్పాలిన్ షెడ్డును శ్రమదానంతో నిర్మించారు. గ్రామంలో పిల్లల తల్లిదండ్రులు విద్యాశాఖకు సహకరిస్తూ గ్రామస్తులే తమ స్థలాన్ని కేటాయించి, చందాలు ఎత్తి చెరో కొంత డబ్బును పోగు చేసుకుని టార్పాలిన్, వెదురు కర్రలు తీసుకొచ్చి షెడ్డు నిర్మాణం చేపట్టారు. గ్రామంలో ప్రభుత్వం తాత్కాలికంగా ఎన్ ఆర్ ఎస్ టి సి ( నాన్ రెసిడెన్షియల్ స్పెషల్ ట్రైనింగ్ సెంటర్) ను ఏర్పాటు చేశారు. అయితే గ్రామంలో మొదటి సారి పాఠశాల రావటం పిల్లల తల్లిదండ్రులకు గ్రామస్తులకు ఎంతో ఉత్సాహనీ నిచ్చింది. మొంజగూడ గ్రామంలో సుమారు 28 కుటుంబాలకు గాను సుమారు 126 మంది జనాభా కలిగి ఉన్నారు. ఆదివాసి పివిటిజి గిరిజనులు నివసిస్తున్న ఈ గ్రామంలో పాఠశాల లేక అదే లక్ష్మీపురం పంచాయతీకి చెందిన సమీప గ్రామాలైన ఉబ్బెంగులకు పిల్లలను బడికి పంపేవారు. అయితే విద్యార్థులకు బడికి పంపినప్పుడు వారితోపాటు ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డ దాటించుటకు విద్యార్థుల తల్లిదండ్రులు కొంతమంది ఉండాల్సిన పరిస్థితి. పెద్దల సహాయము లేనిదే పాఠశాలకు విద్యార్థులు రాకపోకలు కష్టతరమవుతుంది. ఇటువంటి పరిస్థితుల్లో ఎన్ఆర్ఎస్ టిసి పాఠశాల మొంజాగూడ గ్రామంలో ఏర్పాటుకు ప్రభుత్వం స్పందించి ఎన్ఆర్ఎస్ టి సి ఏర్పాటు చేసింది. మొంజాగూడలో మొత్తం 26 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.

**పాఠశాల నిర్వహణకు టార్పల్లిన్ షెడ్డు నిర్మాణం**

ప్రభుత్వ సహాయం అందకపోయినా తమ పిల్లల చదువు కోసం, పిల్లలు కూర్చుని చదువుకోవడానికి పాఠశాల నిర్వహణకు పాఠశాల షెడ్డు నిర్మాణానికి విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్తులు చెరోకొంత చందాలు ఎత్తుకునీ, డబ్బులు సమకూర్చారు. గ్రామస్తులు ఐక్యంగా సమీప అడవికి వెళ్లి కట్టెలు కలప తెచ్చి పిల్లలకు వర్షం ఎండ తగలకుండా ఉండేలా స్వయంగా తమ చేతులతోనే వెదురు కర్రలు, టార్పల్లిన్ తో తాత్కాలికంగా షెడ్డును నిర్మించుకున్నారు.

**టార్పల్లిన్ షెడ్డులోనే కొనసాగుతున్న పాఠశాల**

ఈ సందర్భంగా లక్ష్మీపురం సూపర్ ఎంపిటిసి వంతాల సాదూరం, విద్యార్థుల తల్లిదండ్రులు వంతాల తిరుపతి, గ్రామస్తులు పాత్రికేయులతో మాట్లాడుతూ.. పాఠశాల తరగతిగది టార్పలిన్ ను కట్టి పాఠశాలను కొనసాగించడం ద్వారా వర్షం కురిసిన, ఎక్కువ ఎండ కాసిన ఉక్కబోతతో పిల్లలు ఇబ్బంది పడుతున్నారన్నారని, బలమైన తీవ్ర ఈదురుగాలులు వీచినప్పుడు షెడ్డు కూలి పిల్లలకు తీవ్ర ముప్పు ఉన్నప్పటికీ తప్పని పరిస్థితుల్లో పాఠశాలను కొనసాగిస్తున్నారనీ పిల్లల తల్లితండ్రులు తెలిపారు.

**గ్రామంలో శాశ్వత పాఠశాల ఏర్పాటు చేయాలి.**

గ్రామంలో ఎన్ ఆర్ ఎస్ టి సి కాకుండా శాశ్వత పాఠశాల ఏర్పాటు చేయాలని, 26 మంది విద్యార్థులు చదువుకుంటున్న పరిస్థితుల్లో శాశ్వత పాఠశాలలు మంజూరు చేయాలని పిల్లల తల్లిదండ్రులు గ్రామస్తులు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. తమ పిల్లలు వేరే ఇతర గ్రామంలో వెళ్లి చదువుకోవడానికి గ్రామ సరిహద్దుల్లో పెద్ద గెడ్డ ప్రవహిస్తున్నందున, అవి తమ పిల్లల చదువుకు అవరోధంగా ఉండటం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ నేపథ్యంలో గ్రామంలో తాత్కాలిక పాఠశాల కాకుండా శాశ్వత పాఠశాల ఏర్పాటుకు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

**పాఠశాల భవన నిర్మాణానికి గ్రామస్తులు ఉచితంగా స్థలాన్ని కేటాయిస్తాం**

ప్రభుత్వం మొంజగూడ గ్రామంలో శాశ్వత పాఠశాలను ఏర్పాటు చేస్తే పాఠశాల భవన నిర్మాణానానికి ఉచితంగా గ్రామస్తులు స్థలాన్ని కేటాయిస్తామని పిల్లల తల్లిదండ్రులు తెలిపారు. తమ పిల్లల భవిష్యత్తు కన్నా తమకు ఏది గొప్పది కాదని వారు ప్రభుత్వానికి తెలిపారు.

**వినతి పత్రాలపై అధికారుల స్పందన కరువు**

మొంజాగూడ గ్రామంలో శాశ్వత పాఠశాల ఏర్పాటు చేయాలని, రెగ్యులర్ ఉపాధ్యాయుని నియమించాలని ఉన్నతాధికారుల దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లిన వారి నుండి స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. 26 మంది విద్యార్థులు చదువుకుంటున్న తమ గ్రామంలో శాశ్వత పాఠశాల ప్రభుత్వ రెగ్యులర్ టీచర్ ను నియమించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. గ్రామంలో ఎన్ ఆర్ ఎస్ టి సి ఎత్తేస్తే మరల తమ పిల్లలు సమీప గ్రామమైన ఉబ్బెంగులకు వెళ్ళి చదువుకొనుటకు గెడ్డ వల్ల ప్రమాదం పొంచి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నేత, లక్ష్మీపురం సూపర్ ఎంపిటిసి వంతాల సాదూరం, గ్రామస్తులు విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వంటగది లేని పాఠశాలకు గ్రామస్తులే దిక్కు

- రూ.15 వేల చందాలు.. శ్రమదానంతో వంటగది నిర్మాణం
- స్వయం సహాయక స్ఫూర్తితో ఆదర్శంగా నిలిచిన జి.తీములబంధ గిరిజనులు



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,ఆగస్టు 21:** ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూడకుండా తమ సమస్యను తామే పరిష్కరించుకుని అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం జి.తీములబంధ గ్రామ గిరిజనులు ఆదర్శంగా నిలిచారు.గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో వంట షెడ్డు లేకపోవడంతో వర్షాకాలంలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తయారు చేయడం వంట సిబ్బందికి ఇబ్బందిగా మారింది. వర్షం పడిన ప్రతిసారీ వంట చేయడానికి అవస్థలు పడాల్సి వచ్చేది. ఈ సమస్యను గమనించిన గ్రామస్తులు ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూడకుండా తమవంతుగా పరిష్కరించుకోవాలని నిర్ణయించారు. గ్రామంలోని ప్రతి ఒక్కరూ ఒక్కతాటిపైకి వచ్చి చందాల రూపంలో రూ.15 వేల వరకు సమీకరించారు. అనంతరం గ్రామస్తులే శ్రమదానం చేసి స్థానికంగా లభించే కలపను ఉపయోగించి పాఠశాల ఆవరణలో వంటగదిని నిర్మించారు. దీంతో వంట సిబ్బందికి ఇబ్బందులు తొలగడమే కాకుండా, విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సక్రమంగా అందించే అవకాశం ఏర్పడింది.'మన సమస్య.. మనమే పరిష్కారం' అనే ఆలోచనతో గ్రామస్తులు చూపిన ఐక్యత, స్వయం సహాయక స్ఫూర్తి అభినందనీయమని పలువురు పేర్కొంటున్నారు. ప్రభుత్వంపై ఆధారపడకుండా సామూహికంగా ముందుకొచ్చి పాఠశాల అవసరాన్ని తీర్చడం ఇతర గ్రామాలకు కూడా ఆదర్శంగా నిలుస్తుందని అభిప్రాయపడుతున్నారు.పాఠశాల అభివృద్ధిలో గ్రామస్తుల భాగస్వామ్యం ఉంటే ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతం అవుతాయనే సందేశాన్ని జి.తీములబంధ గిరిజనులు చాటిచెప్పారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ఆంధ్ర థీమ్‌తో స్వచ్ఛ ఆంధ్ర దినోత్సవం.

**అరకులోయ పెన్ పవర్ ఆగస్టు 21:** అల్లూరి జిల్లా కలెక్టర్ జిల్లా మేజిస్ట్రేట్ శ్రీమతి నిశాంతి టి., ఐఏఎస్ వారి ఆదేశాల మేరకు, స్వర్ణాంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే "స్వచ్ఛ ఆంధ్ర దినోత్సవంను 2026 ఆగస్టు 22వ తేదీన అరకు మండలంలోని గన్నెల గ్రామంలో నిర్వహించనున్నారు. ఆగస్టు నెలలో ఆరోగ్యకరమైన పాఠశాలలు, ఆరోగ్యకరమైన ఆంధ్ర" అనే థీమ్‌ను నిర్ణయించారు.

పాఠశాలలు ఇతర సంస్థల్లో పరిశుభ్రమైన, సురక్షితమైన గౌరవప్రదమైన వాతావరణాన్ని కల్పించడమే ప్రధాన లక్ష్యంగా నిర్దేశించారు.

జిల్లా కలెక్టర్ జిల్లా మేజిస్ట్రేట్ నిశాంతి టి., వారి ఆధ్వర్యంలో నిర్వహించనున్నందున, అరకులోయ మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు సిబ్బంది తమ తమ శాఖల తరఫున కార్యక్రమంలో చురుకుగా పాల్గొని, స్వర్ణాంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరడమైనది.

పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామపంచాయతీలు, ప్రభుత్వ కార్యాలయాలు ఇతర సంస్థలలో పరిశుభ్రత కార్యక్రమాలు, మరుగుదొడ్లు, చేతులు కడుక్కునే ప్రదేశాలు, తాగునీటి సౌకర్యాల తనిఖీ, చెత్తను తడి పొడి వ్యర్థాలుగా వేరు చేయడం, వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు తమ శాఖల పరిధిలోని సిబ్బందిని సమన్వయం చేసుకుని, ప్రజాప్రతినిధులు, ప్రజలు, స్వయం సహాయక సంఘాలు సంబంధిత వర్గాల భాగస్వామ్యంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరడమైనది.

పరిశుభ్రమైన పాఠశాల ఆరోగ్యకరమైన విద్యార్థి ఆరోగ్యకరమైన ఆంధ్ర" అనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ స్వచ్ఛ ఆంధ్ర దినోత్సవంలో భాగస్వాములు కావాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



## పీజీఆర్ఎస్ ఫిర్యాదుకు స్పందన.. పెద్ద జాడుమూరు చెక్‌డ్యామ్ పరిశీలన



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,ఆగస్టు 21:** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో అందిన ఫిర్యాదుపై ఇరిగేషన్ అధికారులు స్పందించారు. సంకాడ మండలం పెద్ద జాడుమూరు గ్రామంలోని చెక్‌డ్యామ్‌ను ఇరిగేషన్ శాఖ ఏఈ నాగరాణి ఆధ్వర్యంలో అధికారులు గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెక్‌డ్యామ్ పరిస్థితిని పరిశీలించిన అధికారులు.. రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు చెక్‌డ్యామ్‌కు సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రైతులకు సాగునీటి ఇబ్బందులు కలగకుండా సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు అందిన వెంటనే అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలనకు రావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ పంచాయతీ అధ్యక్షుడు గోవింద్, నాయకులు మామిడి చంటిబాబు,సడ్డ బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా బ్యాడ్మింటన్ పోటీల్లో దీప్తికా ప్రతిభ



**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు,పెన్ పవర్,ఆగస్టు 21:** అల్లూరిసీతారామరాజు జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో దీప్తికా విజయం సాధించి, రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. తిరుపతిలో జరగనున్న అమరావతి ఛాంపియన్‌షిప్--2026 రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో ఆమె అల్లూరిసీతారామరాజు జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ సందర్భంగా పాండు కరాటే అకాడమీ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్, ఎగ్జామినర్ సెంసేయ్ బాకూరు పాండు రాజు దీప్తికాకు అభినందనలు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి విజయం సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పాండు కరాటే అకాడమీ కార్యక్రమాలను ప్రోత్సహిస్తూ విద్యార్థులను క్రీడల్లో ముందుకు తీసుకెళ్తున్న జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ టి.నిశాంతి , జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజా, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదిత్య వర్మ, డీఈఓ భానుమూర్తి రాజు, జిల్లా క్రీడల అధికారి జగన్మోహన్ రావు, జిల్లా క్రీడల కార్యదర్శి పాంగి సూరిబాబు, ఇతర జిల్లా అధికారులకు అకాడమీ తరఫున పాండు రాజు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి జిల్లా ఖ్యాతిని మరింత ఇనుమడింపజేయాలని పలువురు ఆకాంక్షించారు.

## స్థానిక ఎన్నికల్లో కార్యకర్తలదే కీలక పాత్ర

- వైఎస్సార్‌సీపీ శ్రేణులు సమష్టిగా పనిచేయాలి
- ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు




**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు,పెన్ పవర్,ఆగస్టు 21:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి కార్యకర్తలే కీలకమని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు సీధరి రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరాజు మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని అన్నారు. తమ ప్రభుత్వ హయాంలో వేసిన రహదారులు, చేపట్టిన పనులను ప్రస్తుత కూటమి ప్రభుత్వం తామే చేసినట్లు ప్రచారం చేసుకుంటోందని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం గిరిజన ప్రాంతాల అభివృద్ధి, సంక్షేమంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు, చేసిన మోసాలను గ్రామస్థాయిలో ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించేలా కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీకి అండగా నిలిచిన ప్రతి కార్యకర్తకు తాము అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. వైఎస్సార్‌సీపీలో ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సీధరి రాంబాబు, ప్రచార కమిటీ రాష్ట్ర కార్యదర్శి కూతంగి సూరిబాబు, జిల్లా మహిళా అధ్యక్షురాలు కురూస పార్వతమ్మ, నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు శరభ సూర్యనారాయణ, మాజీ సర్పంచ్, సీనియర్ నాయకుడు గబ్బాడి చిట్టిబాబు, ఎంపీటీసీ గిడ్డి విజయలక్ష్మి, మాజీ ఏఎంసీ చైర్మన్ లకే రామసత్యవతి, మహిళా అధ్యక్షురాలు కోడా సుశీల, సీనియర్ నాయకులు గంగరాజు, నీలకంఠం, ఎంపీటీసీలు, వివిధ అనుబంధ విభాగాల నాయకులు, మాజీ సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జూనియర్ డాక్టర్లు ఆందోళనకు సిఐటియు మద్దతు.



**అరకులోయ పెన్ పవర్ ఆగస్టు 21:** అరకులోయలో గత కొన్ని రోజులుగా న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని రాష్ట్రంలో జూనియర్ డాక్టర్లు ఆందోళన నిర్వహిస్తున్నారు . వారి పోరాటానికి సిఐటియు అల్లూరు జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని తెలిపారు శుక్రవారం పాడేరు జిల్లా ఆఫీసులో విలేకరులకు తెలియజేశారు. సిఐటియు జి, అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాలి, కోశాధికారి ఎస్ బి పోతురాజు వారితో కలిసి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పెరిగిన నిత్యవసర ధరలు కనుగుణంగా స్టయిఫండ్ 30% పెంచాలని డిమాండ్ చేశారు జూనియర్ డాక్టర్లు సుమారు మూడు సంవత్సరాల నుంచి ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్న వారి నుండి ఎటువంటి స్పందన రాకపోవడంతో ఆందోళన దిగేరని తెలిపారు. ప్రభుత్వం తక్షణం వారితో చర్చించి డిమాండ్ల పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. సమస్యను చర్చల ద్వారా పరిష్కరించకుండా దొడ్డిదారిన ప్రభుత్వం సమ్మెను విచ్చును చేసేందుకు ప్రైవేటు వైద్యులను రంగంలోకి దింపుతుందని అన్నారు. కోట్ల రూపాయలు కార్పొరేట్లకు రాయితీలు ఇస్తున్న ప్రభుత్వం పేద ప్రజలకు సేవ చేస్తున్న జూనియర్ డాక్టర్లకు స్టయి పండు పెంచేందుకు ప్రభుత్వం మినీ వేషాలు లెక్కిస్తుందని అన్నారు. కూటమి ప్రభుత్వానికి కార్మికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు సమస్యలు పట్టడం లేదని తెలిపారు అందుకే ఉద్యమ బాట ఎంచుకున్నారని వారి ఆందోళన ఉధృతం కాకముందే సమస్య పరిష్కరించాలని అన్నారు.

## నాలుగు దశాబ్దాల ఫోటోగ్రఫీ సేవలకు ఘన గౌరవం





- చందు సుబ్బారావుకు "ఫోటోగ్రఫీ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు"
- వందలాది మంది శిష్యులను తీర్చిదిద్దిన చందు సుబ్బారావు
- సురేష్ స్టూడియో అధినేతకు ఘన సన్మానం

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, ఆగస్టు 21 :** ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖపట్నం జిల్లా ఫోటోగ్రఫీ అండ్ వీడియోగ్రఫీ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ భవన్‌లో ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలపట్నానికి చెందిన సురేష్ స్టూడియో అధినేత, కళా సేవా పీఠం గౌరవ అధ్యక్షులు చందు సుబ్బారావును "ఫోటోగ్రఫీ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు"తో ఘనంగా సత్కరించారు. గత నాలుగు దశాబ్దాలుగా ఫోటోగ్రఫీ రంగంలో చందు సుబ్బారావు అందిస్తున్న సేవలను గుర్తించిన అసోసియేషన్ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించి, జ్ఞాపిక, శాలువాతో గౌరవించారు. ఫోటోగ్రఫీ రంగంలో తనకున్న అనుభవాన్ని నూతన తరానికి అందిస్తూ వందలాది మంది శిష్యులకు శిక్షణ ఇచ్చి, వారు స్వయం ఉపాధి పొందేలా మార్గనిర్దేశం చేసినందుకు ఈ పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో ముందుగా చిన్నారులు నిర్వహించిన నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం ఫోటోగ్రఫీ అసోసియేషన్ కుటుంబాలకు చెందిన విద్యార్థుల్లో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ప్రతిభావంతులకు నగదు బహుమతులను అందజేశారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. సన్మానం అనంతరం చందు సుబ్బారావు మాట్లాడుతూ, చదువు, సంస్కారం పదిమందికి మార్గదర్శకంగా ఉండాలనే ఉద్దేశంతో అనేకమంది శిష్యులకు ఫోటోగ్రఫీలో శిక్షణ అందించానని తెలిపారు. క్రమశిక్షణతో వృత్తి నైపుణ్యాలను నేర్పిన శిష్యులు నేడు మంచి స్థాయిలో స్థిరపడి, తమ కుటుంబాలను పోషించుకుంటూ ప్రయోజకులుగా మారడం తనకు ఎంతో ఆనందాన్ని ఇస్తోందన్నారు. తన సేవలను గుర్తించి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుతో సత్కరించిన ఫోటోగ్రఫీ అసోసియేషన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చందు సుబ్బారావు మాట్లాడుతూ, తనను ఆదరించి, అభిమానించి, గుర్తించి సన్మానించిన ఫోటోగ్రఫీ అసోసియేషన్ అధ్యక్షులు లోకేష్ కుమార్, కార్యదర్శి నూకరాజు, ట్రెజరర్ చంద్రశేఖర్, కమిటీ సభ్యులు, గౌరవ సలహాదారులు రాజు, కేశవరావు, గంగాధర్, శ్రీరామ్మూర్తి, గిరి, కిట్టు తదితరులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. తన శిష్యులందరికీ శుభాశీస్సులు అందజేశారు. చందు సుబ్బారావుకు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు లభించడంపై గోపాలపట్నం కళా సేవా పీఠం సభ్యులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నందవరపు సోములు, గోరకల రామదాసు, కొంత నూక రాజేశ్వరరావు, ఏ. విశ్వేశ్వరరావు, ఇమంది రామకృష్ణ, కే. వెంకటేష్, శివశంకర్, జి. వెంకటేష్ తదితరులు పాల్గొని చందు సుబ్బారావును సత్కరించి అభినందనలు తెలిపారు. ఫోటోగ్రఫీని కేవలం వృత్తిగా కాకుండా, నైపుణ్యాన్ని నలుగురికి పంచే బాధ్యతగా భావిస్తూ నాలుగు దశాబ్దాలుగా సేవలందిస్తున్న చందు సుబ్బారావుకు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు లభించడం గోపాలపట్నం ఫోటోగ్రఫీ రంగానికి గర్వకారణమని పలువురు పేర్కొన్నారు. ఆయన శిష్యులు మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

## బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే వంశీకృష్ణ పరామర్శ

**ప్రణయ్ తేజ్ కుటుంబానికి అండగా ఉంటామని హామీ**

**గల్లంతైన అప్పన్న కుటుంబానికి భరోసా**

**విశాఖ దక్షిణం పెన్ పవర్ ఆగస్టు 21 :** టౌన్ కొత్త రోడ్డులోని లిటిల్ గార్డెన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ప్రణయ్ తేజ్ ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన నేపథ్యంలో దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వారి నివాసానికి వెళ్లి తల్లిదండ్రులను కలుసుకుని ఘటనకు సంబంధించిన వివరా లను అడిగి తెలుసుకున్నారు. చిన్నారిని కోల్పోయిన తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతమని ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని, తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. గల్లంతైన మత్స్యకారుడి కుటుంబానికి పరామర్శ

అనంతరం 37వ వార్డులోని ఫిషింగ్ హార్బర్ సమీపంలో వేట ముగించుకుని తిరిగి వస్తుండగా ప్రమాదవశాత్తు గల్లంతైన అప్పన్న కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. కుటుంబ సభ్యులను కలిసి ఘటన వివరాలను తెలుసుకున్నారు.

అప్పన్న గల్లంతైన ఘటన తీవ్రంగా బాధాకరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కుటుంబానికి ప్రభుత్వం నుంచి అందాల్సిన సహాయాన్ని త్వరగా అందేలా సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాధిత కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమాల్లో స్థానిక నాయకులు, బోట్ అసోసియేషన్ ప్రతినిధులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## డి ఆర్ డిపో ఏర్పాటుకు తహసిల్దార్ కృషి...!



**కొయ్యూరు, పెన్ పవర్ ఆగస్టు 21 :** పి జి ఆర్ ఎస్ లో వచ్చిన ఫిర్యాదు మేరకు తాసిల్దార్ వెంటనే స్పందించారు. శుక్రవారం రాజేంద్రపాలెం పంచాయతీ జోగుంపేట, సోలాబు గ్రామాలను తాసిల్దార్ ప్రసాదరావు సందర్శించి రెండు గ్రామాలకు సంబంధించి సోలాబు లో డిఆర్ డిపో ఏర్పాటుకు కృషి చేస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. అలాగే జోగంపేటలో కూడా ప్రాథమిక పాఠశాల ఏర్పాటుకై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు . కార్యక్రమంలో తాసిల్దార్ వారితోపాటు కార్యాలయ సిబ్బంది లోవరాజు, వైసీపీ మండల ఉపాధ్యక్షులు నర్సి కృష్ణ, వంతల రంగారావు తదితరులు పాల్గొన్నారు.

## ఏరో ఎక్స్‌ప్రెస్‌పై మంత్రి మండపల్లి పరిశీలన

- సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచన
- మంత్రి మండపల్లి




**విశాఖ, పెన్ పవర్, ఆగస్టు 21 :** విశాఖపట్నం నుంచి ఏఎస్ఆర్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌కు నడుస్తున్న ఏరో ఎక్స్‌ప్రెస్ బస్సుల నిర్వహణను రవాణా, క్రీడల శాఖ మంత్రి మండపల్లి రాంప్రసాద్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బస్సుల పరిస్థితిని మంత్రి పరిశీలించి, వాటి నిర్వహణపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏరో ఎక్స్‌ప్రెస్ బస్సులు నిర్ణీత సమయపట్టిక ప్రకారం సమయపాలనతో నడుస్తున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. ప్రస్తుతం బస్సుల్లో ప్రయాణికుల ఆక్యుపెన్సీ సుమారు 30 శాతం మాత్రమే ఉందని తెలిపారు. విమానాశ్రయానికి వెళ్లే ప్రయాణికులు ఏరో ఎక్స్‌ప్రెస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. ఇతర రవాణా మార్గాలతో పోలిస్తే తక్కువ ఛార్జీలతో ఈ సేవలు అందుబాటులో ఉన్నాయని, రూ.50 నుంచి రూ.400 వరకు ఛార్జీలు ఉన్నందున ప్రయాణికులు వీటిని వినియోగించుకోవాలని కోరారు. అనంతరం భోగాపురం విమానాశ్రయంలో ఏరో ఎక్స్‌ప్రెస్ బస్సుల నిర్వహణను కూడా మంత్రి పరిశీలించారు. విశాఖపట్నం రీజినల్ మేనేజర్ బి. అప్పలనాయుడు ఆధ్వర్యంలో బస్సు సేవలను సమర్థవం తంగా నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ సి.టి.యం కె. పద్మావతి, డీసీఎంఈ ఎ. గంగాధర్, డిపో మేనేజర్లు ప్రసాద్, దుర్గ, సూపర్‌వైజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా లోకుల గాంధీ ఐదోవ వర్ధంతి...!




ఉచిత రక్తదాన శిబిరం, నిరుపేదలకు గొడుగులు పంపిణీ...

**కొయ్యూరు, పెన్ పవర్ ఆగస్టు 21:**విద్యావంతుడు నిస్వార్థ సేవకులు ఎంతోమందికి స్ఫూర్తి ప్రదాత అయినటువంటి లోకుల గాంధీ ఐదవ వర్ధంతి మహాసభ చాలా ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలోభాగంగా మన ఊరు =మనజెండా ఆవిష్కరణ నడింపాలెం కూడలిలో జిల్లా అధ్యక్షులు ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది.అన్ని పార్టీల నాయకులు మరియు వారి అభిమానులు వేల సంఖ్యలో పాల్గొనడం జరిగింది. ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది . దానిలో భాగంగా సుమారు 60 మంది ఉచితంగా రక్తదానం చేయడం జరిగింది రక్తదానం చేసిన వారిలో మహిళలు ఉండటం విశేషం.ఈ కార్యక్రమంలో వివిధ పార్టీ నాయకులు యువకులు గాంధీ స్ఫూర్తిని వారి నాయకత్వాన్ని చాలా గొప్పగా వర్ణిస్తూ వారితో ఉండే జ్ఞాపకాలను స్మరణ చేసుకున్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర భారతీయ జనతా పార్టీ కార్యదర్శి స్వప్న కుమారి మాట్లాడుతూ... గాంధీ మాకు సమాజం పట్ల అంకిత భావం నేర్పించారని మరియు అల్లూరి జిల్లా విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ మెంబర్ వంతల దేవదాసు మాట్లాడుతూ... నాయకులు పాదయాత్రలు పదవుల కోసం చేస్తారు గాంధీ ప్రజా సమస్యల తెలుసుకొని వాటిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియజేయడానికి ఏజెన్సీ గిరిజన ప్రాంతాన్ని అంతటినీ పాదయాత్ర చేయడం జరిగింది అని ఆయన అన్నారు . వారితో ప్రయాణం నేను మర్చిపోలేని మధుర స్మృతులు అని తెలియజేశారు ముఖ్యఅతిథిగా విచ్చేసిన అనకాపల్లి జిల్లా అధ్యక్షులు ద్వారపూడి పరమేశ్వర రావు మాట్లాడుతూ... భారతీయ జనతా పార్టీలో ఏదైతే నినాదం ఉందో అది దేశం ముఖ్యం, సమాజం ముందు తరువాతే వ్యక్తిగతం కనేది నిజంగా గాంధీ ని చూసినతరువాత మాకు అర్థమయ్యిందని, ఈ వేదికలో విచ్చేసిన అన్నిపార్టీలవారుఉన్నారని వారి సిద్ధాంతాలు వేరేయినా ఒకేవేదిక పంచుకోవటం ఇది గాంధికి సమాజం పట్ల ఎలాంటి అంకితభావం చూపించారో అర్థమవుతుంది. ఏ పార్టీలో ఉన్నామన్నదీకాదు అన్నిపార్టీల వ్యక్తులు కూడా సమానమే అందరి లక్ష్యం సమాజం పట్ల అంకితభావం కలిగి ఉండటమే అని తెలిజేశారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కే వి వి సత్యనారాయణ , రాష్ట్ర కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధానకార్యదర్శి పాకాలపాటి రవిరాజు , యువమోర్చ అల్లూరి జిల్లా ఇంచార్జి అడిగర్ల సతీష్ , టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొట్టగుల్లి సుబ్బారావు , కొయ్యురు టిడిపి మండల అధ్యక్షులు కాకూరి చందరావు , సిపిఐ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ, కొయ్యురు వైసిపి మండల అధ్యక్షులు బిడిజన అప్పారావు, మరియు జిల్లా ప్రధాన కార్యదర్శి అరిమెల రాజు, ఉపాధ్యక్షులు జైతు ప్రభాకర్, కొయ్యురు మండల బిజెపి అధ్యక్షులు సంపరి శివకుమారు, మరియు అన్ని పార్టీల జిల్లానాయకులు మండల నాయకులు అభిమానులు పెద్దఎత్తున పాల్గొని ఘనమైన నివాళ్లు అర్పించారు ఈ కార్యక్రమం లో నిరుపెదలకు 300 మందికి గొడుగులు, పంపిణి చేయటం జరిగింది నాయకులందరికి మెమంటోస్ జ్ఞాపకార్థంగా ఈ కార్యక్రమంలోఅందిచటం జరిగింది.

**రోగులకు ఆసుపత్రిలో పండ్లు, రొట్టె, పాలు పంపిణీ :**

బిజెపి యువనేత లోకుల గాంధీ ఐదో వర్ధంతి సందర్భంగా రాజేంద్రపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బిజెపి నేత మేడి బోయిన చక్కరరావు (చిన్న) ఆధ్వర్యంలో రోగులకు పాలు రొట్టె పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి నేతలు పాల్గొన్నారు.




# ప్రజలపై అదనపు భారం మోపొద్దు



**మత్స్యకారులకు ఉద్యోగాలు ఇవ్వాలి**

**జీఎంఆర్‌తో కూటమి ప్రభుత్వం ప్రజలకు అన్యాయం చేస్తోంది: వాసుపల్లి గణేష్‌కుమార్**

**విశాఖ దక్షిణం పెన్ పవర్ ఆగస్టు 21 :**భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రయాణికులు, వాహనదారులపై అదనపు వసూళ్లు చేయడాన్ని వెంటనే నిలిపివేయాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ దక్షిణ నియో జకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ డిమాండ్ చేశారు. శు క్రవారం ఆశీలమెట్టలోని పార్టీ కార్యాలయంలో దక్షిణ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి నిర్వహిం చిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. భోగాపు రం విమానాశ్రయాన్ని జీఎంఆర్‌కు ప్రభుత్వం తక్కువ ధరకు అప్పగించిందని వాసుపల్లి ఆరోపించారు. మత్స్యకారుల నుంచి సేకరించిన భూములతో నిర్మించిన విమానాశ్రయంలో స్థానిక మత్స్యకారులకు ఒక్క ఉద్యోగం కూడా కల్పించలేదని విమర్శించారు. విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన మౌలిక వసతుల్లో గత ప్రభుత్వం చేసిన పనులను ప్రస్తుత ప్రభుత్వం తన ఖాతాలో వేసుకుంటోందని అన్నారు.

ప్రయాణికులపై విధిస్తున్న పార్కింగ్, ఇతర చార్జీలు తీవ్ర భారంగా మారాయని వాసుపల్లి పేర్కొన్నారు. ఢిల్లీ, ముంబై విమానాశ్రయాలతో పోలిస్తే భోగాపురంలో కొన్ని రకాల చార్జీ లు అధికంగా ఉన్నాయని ఆరోపించారు. టాక్సీ డ్రైవర్ల నుం చి రెండు గంటల పార్కింగ్‌కు రూ.600 వసూలు చేయడం సమంజసం కాదన్నారు.విమానాల ల్యాండింగ్, టేకాఫ్ చార్జీల ద్వారా జీఎంఆర్‌కు భారీగా ఆదాయం సమకూరుతుందని వాసుపల్లి పేర్కొన్నారు. కార్గో, పార్కింగ్, కమర్షియల్ స్పేస్, హాస్పిటాలిటీ తదితర మార్గాల్లోనూ గణనీయమైన ఆదాయం వస్తుందని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలపై అదనపు భారాలు మోపడం సరికాదని చెప్పారు.విశాఖ నగరం నుంచి విమానాశ్రయాన్ని దూరం చేయడం వల్ల స్థానిక ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాసుపల్లి అన్నారు. విశాఖకు జరుగుతున్న అన్యాయంపై అధికార పార్టీకి చెందిన స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీ స్పందించాలని డిమాండ్ చేశారు. మత్స్యకారులకు ఉద్యోగాలు కల్పించాలని, విశాఖలో విమా నాశ్రయ సేవలను కొనసాగించాలని కోరారు. చంద్రబాబు, లోకేష్‌లు జీఎంఆర్‌తో చేసుకున్న ఒప్పందాలపై ప్రజలకు పూర్తి వివరాలు వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. విశాఖ అభివృద్ధికి విరుద్ధంగా నిర్ణయాలు తీసుకుంటే ప్రజల తరపున పోరాటం చేస్తామని హెచ్చరించారు.


గూగుల్ డేటా సెంటర్‌పైనా విమర్శలు

విశాఖలో ప్రతిపాదిత గూగుల్ డేటా సెంటర్ విషయంలోనూ వాసుపల్లి గణేష్‌కుమార్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. భారీ స్థాయిలో నీటి వినియోగం జరిగే అవకాశం ఉందని, ఇప్పటికే నీటి సమస్యలు ఎదుర్కొంటున్న విశాఖపై అదనపు భారం పడే ప్రమాదం ఉందని అన్నారు.డేటా సెంటర్‌కు అవసరమైన నీటి వినియోగం, పర్యావరణ ప్రభావం, స్థానిక ప్రజలకు కలిగే ప్రయోజనాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. గూగుల్ సంస్థ నుంచి రాష్ట్రానికి, విశాఖ నగరానికి వచ్చే ఆదాయంపై కూడా పారదర్శకత ఉండాలని అన్నారు.గూగుల్ డేటా సెంటర్ ద్వారా వచ్చే ఆదాయంలో కొంత భాగాన్ని విశాఖ మౌలిక వసతుల అభివృద్ధికి కేటా యించాలని వాసుపల్లి సూచించారు. నీటి వనరులు, కాలు ష్యం, పర్యావరణ ప్రభావాలపై నిపుణులతో సమగ్ర అధ్య యనం చేయాలని కోరారు.విశాఖపై జరుగుతున్న పరిణా మాల విషయంలో ప్రజాప్రతినిధులు మౌనం వీడాలని వాసు పల్లి అన్నారు. నగర ప్రయోజనాలకు భంగం కలిగించే నిర్ణ యాలను వైఎస్సార్‌సీపీ అడ్డుకుంటుందని చెప్పారు. రాబో యే మేయర్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ సత్తా చూపిస్తామని ప్రకటించారు.

ఈ సమావేశంలో వార్డు అధ్యక్షుడు దొడ్డి బాపు ఆనంద్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ రేయ్యి డేవిడ్ రాజు, జిల్లా జనరల్ సెక్రటరీ గనగళ్ల రామరాజు, రాష్ట్ర బీసీ సెల్ సెక్రటరీ లండ రమణ, జిల్లా బీసీ సెల్ జనరల్ సెక్రటరీ చోడిపిల్లి శివ, దక్షిణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆకుల శ్యామ్, అంబటి అప్పలరాజు, శివరెడ్డి, చేపల రాజు తదితరులు పాల్గొన్నారు.


# బొంతువలస ఘాట్‌లో ఐచర్ వాహనం బోల్తా


- డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలు
- తప్పిన పెను ప్రమాదం




**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,ఆగస్టు 21:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలంలోని పెదవలస నుంచి కొయ్యూరు మండలం బూదరాళ్ల వెళ్లే మార్గంలో శుక్రవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బొంతువలస ఘాట్ రోడ్డులో లోడ్‌తో వెళ్తున్న ఏపీ ఈపీడీసీఎల్‌కు చెందిన ఐచర్ వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాద సమయంలో వాహనంలో ఉన్న డ్రైవర్, క్లీనర్ అదృష్టవశాత్తు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. భారీ వాహనం బోల్తా పడటంతో కొద్దిసేపు స్థానికుల్లో ఆందోళన నెలకొంది. అయితే ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.ప్రమాదంపై స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# విశాఖ గొంతు కోస్తున్న డేటా సెంటర్లు!







- తాగునీటి రిజర్వాయర్‌కు 120 మీటర్ల దూరంలో గూగుల్-అదానీ భారీ నిర్మాణం
- కొండలు కూల్చివేత, అడవుల నరికివేత - పర్యావరణ అనుమతి లేకుండానే పనులు
- 1 టీఎంసీయా 3 టీఎంసీయా నీటి లెక్క తెలియని ప్రభుత్వం-
- 17 ఏళ్లుగా సుజల స్రవంతి 2% కూడా పూర్తి చేయని సర్కార్, డేటా సెంటర్లకు మాత్రం పోలవరం నీళ్లు - ఉద్యోగాలు 600 మాత్రమే!

**విశాఖ తూర్పు,పెన్ పవర్, ఆగస్టు 21:** విశాఖ, ఉత్తరాంధ్ర ప్రజల భవిష్యత్తును ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు తాకట్టు పెడుతోందని హ్యూమన్ రైట్స్ ఫోరం (హెచ్‌ఆర్‌ఎఫ్) ఘాటుగా విమర్శించింది. ఐటీ మంత్రి నారా లోకేష్ అసెంబ్లీలో చెప్పిన "పర్యావరణ పరిరక్షణ, నీటి భద్రత" మాటలు క్షేత్రస్థాయిలో పూర్తిగా బూటకమని హెచ్‌ఆర్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.రాజేష్, సమన్వయ కమిటీ సభ్యుడు వి.ఎస్.కృష్ణ ఆధారాలతో సహా నిలదీశారు.

ప్రజల గొంతు ఎండగొడుతూ.. కంపెనీల గొంతు తడుపుతూ..

విశాఖ నగరానికి తాగునీరు అందించే ముడసర్లోవ రిజర్వాయర్ క్యాచ్‌మెంట్‌లోనే 512 మెగావాట్ల డేటా సెంటర్‌ను కడుతున్నారు. రిజర్వాయర్‌కు కేవలం 120 మీటర్ల దూరం. ఇది నిబంధనలకు పూర్తి విరుద్ధం. పర్యావరణ అనుమతి జూన్‌లో వస్తే, పనులు ఫిబ్రవరి నుండే మొదలుపెట్టారు. అంటే అనుమతి ఒక తతంగం మాత్రమే.

తర్లువాడలో పరిస్థితి మరీ దారుణం. ఆనందపురం మండలంలో పెద్దచుక్క కొండ రిజర్వ్ ఫారెస్ట్‌ను మొత్తం తొలిచేస్తున్నారు. ఈ కొండల నుంచి పారే వాగులే గంభీరం రిజర్వాయర్‌కు నీరు. కొండ లేకపోతే వాగు లేదు, వాగు లేకపోతే విశాఖకు నీరు లేదు. ఇది ప్రభుత్వానికి తెలియదా?

లెక్కలు తెలియని మంత్రి, నీళ్లు లేని రైతు:

6.5 గిగావాట్లకు ఎంత నీరు కావాలో ప్రభుత్వానికే తెలియదు. మంత్రి లోకేష్ ఒకసారి 1 టీఎంసీ అంటారు, మరోసారి 3 టీఎంసీ అంటారు. ముఖ్యమంత్రి చంద్రబాబు 3.5 టీఎంసీ అంటారు. 1 టీఎంసీ అంటే 28.3 బిలియన్ లీటర్లు. 0.5 టీఎంసీ తేడా అంటే 14 బిలియన్ లీటర్ల తేడా. ఇది ప్రజల తాగునీటి ప్రాణం.

2009లో జీవో నం.3 తో మొదలైన ఉత్తరాంధ్ర సుజల స్రవంతి - 8 లక్షల ఎకరాలకు సాగు, 1200 గ్రామాలకు తాగునీరు ఇచ్చే ప్రాజెక్టు 17 ఏళ్లుగా 2% కూడా పూర్తి కాలేదని ప్రభుత్వ సర్వేనే చెబుతోంది. రైతులకు నీళ్లు ఇవ్వని ప్రభుత్వం, కంపెనీలకు పోలవరం నుంచి ప్రత్యేక పైపులైన్ వేసి ఇస్తానంటోంది. ఈ ఖర్చు ఎవరిది? ప్రజల సొమ్మా?

70% గ్రీన్ ఎనర్జీ అంటే 70% అబద్ధం:

70% పునరుత్పాదక విద్యుత్ ఇస్తామంటున్నారు. సోలార్, విండ్ కు వేల ఎకరాల భూమి, తూర్పు కనుమల్లో పంప్డ్ స్టోరేజ్ పేరుతో మరో విధ్వంసం అవసరం లేదా? దీనికి పర్యావరణ ప్రభావం ఉండదా?


600 ఉద్యోగాలకు వేల ఎకరాలా?

వేల ఎకరాల భూమి, 3 టీఎంసీల నీరు, 6.5 గిగావాట్ల విద్యుత్, ప్రజాధనంతో రోడ్లు, సబ్ స్టేషన్లు అన్నీ ఇస్తే ప్రభుత్వ లెక్కల ప్రకారమే వచ్చే శాశ్వత ఉద్యోగాలు 650, 575 మాత్రమే. నిర్మాణ కూలీలను, రాని అనుబంధ ఉద్యోగాలను కలిపి లక్షల ఉద్యోగాలంటూ ప్రచారం చేయడం దగా కాదా?

ప్రజలకు సమాచారం ఇవ్వకుండా ఆర్ టి ఐ కి "గోప్యం" అని, ప్రశ్నించే వారి పోస్టులు తొలగించడం ద్వారా ప్రభుత్వం ఏం దాస్తోంది? కంపెనీలకు ఇచ్చిన రాయితీలు, ఒప్పందాలు బయటపెట్టాలని, కంబాలకొండ అభయారణ్యం చుట్టూ పెరుగుతున్న ఈ డర్టీ డేటా సెంటర్లపై కేంద్ర పర్యావరణ శాఖతో సమగ్ర విచారణ జరిపించాలని హెచ్‌ఆర్‌ఎఫ్ డిమాండ్ చేసింది.

# విశాఖలో ఆర్ బి ఎల్ ఎస్ ప్రారంభం - ఏపీ ఎం ఎస్ ఎం ఈ లకు అంతర్జాతీయ మార్కెట్ అవకాశాలు

**25 దేశాల నుంచి 400 బయ్యర్లు, 250ఎం ఎస్ ఎం ఈలతో వన్-టు-వన్ భేటీలు**




**విశాఖ తూర్పు,పెన్ పవర్, ఆగస్టు 20::**ఆర్ఏ ఎంపీ పథకం కింద ఏపీ ఎంఎస్ఎండిసి ఎఫ్ఐఈఓ, సంయుక్తంగా నిర్వహిస్తున్న 3 రోజుల అంతర్జాతీయ రివర్స్ బయ్యర్-సెల్లర్ మీట ను ఏపీ ఎం ఎస్ ఎం ఈ డి సి చైర్మన్ శ్రీ తమ్మిరెడ్డి శివశంకరరావు గురువారం ప్రారంభించారు.

కార్యక్రమంలో ఏపీ ఎం ఎస్ ఎం ఈ డి సి డైరెక్టర్లు శ్రీ నీలపు విజయానందరెడ్డి, ముగడ రాజారావు, ప్రధాన విజయరామ్, పి.వి.వి. సత్యనారాయణమూర్తి, డా. చిన్నరాజు గుడిపూడి, నల్లే వీర ప్రసన్నకుమార్, ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఎఫ్ ఐ ఈ ఓ ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రీ తమ్మిరెడ్డి శివశంకరరావు మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని, వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, సముద్ర ఉత్పత్తులు, సుగంధ ద్రవ్యాలు, బియ్యం, వస్త్రాలు, రసాయనాలు, ఇంజినీరింగ్ రంగాల్లో అపార అవకాశాలు ఉన్నాయని, విలువ ఆధారిత ఉత్పత్తులు, ప్యాకేజింగ్, ధ్రువపత్రాలపై దృష్టి పెట్టాలని, "వన్ ఫ్యామిలీ - వన్ ఎంటర్‌ప్రెన్యూర్" లక్ష్యాన్ని ప్రస్తావించారు.

ఎఫ్ ఈ ఓజాయింట్ డైరెక్టర్ జనరల్ శ్రీ కె. ఉన్నికృష్ణన్ మాట్లాడుతూ ఎం ఎస్ ఎం ఈ ల ప్రధాన సవాలు నమ్మకమైన బయ్యర్లను గుర్తించడమేనని, ఈ ఆర్ బి ఎం ఎస్ ఆ దూరాన్ని తగ్గిస్తుందని అన్నారు. బయ్యర్లు వ్యవసాయ, ప్రాసెస్డ్ ఫుడ్, స్పైసెస్, రైస్, సీ-ఫుడ్, కెమికల్స్ కొనుగోలుపై ఆసక్తి చూపుతున్నారని తెలిపారు.

ఆగస్టు 19-21 వరకు జరిగే ఈ భేటీల వల్ల ఎఫ్ పి ఒ లు, రైతులు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు మెరుగైన ధర లభిస్తుందని అధికారులు తెలిపారు. విశాఖ జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ శ్రీ ఆదిశేషు కృతజ్ఞతలు తెలిపి రాష్ట్రంలోని ఎగుమతి అవకాశాలను వివరించారు.

